క్లుప్తంగా

శిక్షణలోని అంశాలను తరగతిలో అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కడప ఎంఈఓ పాలెం నారాయణ పేర్కొన్నారు. బుధవారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో కాంప్లెక్స్‌స్థాయి ఒక్క రోజు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఈ కాంప్లెక్స్ సమావేశానికి అన్ని పాఠశాలల నుంచి తప్పకుండా ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఈ విషయంలో ఎవరు కూడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామన్నారు.

పాతపెన్షన్ విధానం అమలయ్యే వరకు పోరాటం

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలయ్యే వరకు పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. బుధవారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనేదే తమ లక్ష్యమని, అందుకోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడమన్నారు. తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ వాడకూడదని ఇచ్చిన ఉత్తర్వులు స్వాగతిస్తున్నామని, అయితే పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేసే యాప్‌లన్నింటినీ కూడా బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, గోపీనాథ్, అయ్యవారురెడ్డి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగంలో నూతన మార్పులు

వైవీయూ : చేనేత రంగంలో నూతన మార్పులు వస్తున్నాయని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు అన్నారు. బుధవారం వైవీయూ లలితకళా విభాగం విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా ఖాజీపేట మండలం రంగాపురంలోని చేనేత వస్త్ర పరిశ్రమను పరిశీలించారు. వస్త్ర యూనిట్లు, పనిచేసే విధానాలను పరిశీలించారు. చేనేత కుటుంబాల వద్దకు వెళ్లి నేతలోని మెలకువలు, పనిచేసే విధానం తెలుసుకున్నారు. కార్యక్రమంలో లలితకళల విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదు చేయించుకోవాలి

కడప అగ్రికల్చర్: పంటసాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా ఈ క్రాపు నమోదు చేయించుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం కడప మండల పరిధిలోని నానపల్లె, పాతకడప పరిధిలో సాగు చేసిన వరిపంటను ఆయన పరిశీలించారు. వరిపంటలో బాక్టీరియల్ లీఫ్ బ్లైట్ తెలుగు ఆశించినట్లు గుర్తించారు. దీని వలన వరి ఆకు కొనలు తెల్లగా మారడం జరుగుతుందన్నారు. దీనిని ఎండు తెగులు అని కూడా అంటారన్నారు. దీని నివారణకు రైతులు యూరియా వాడకం తగ్గించి పొటాస్ ఎరువును వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత కార్మికులకు అండగా నిలబడి వారి సమస్యలను పరిష్కరించాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగరశాఖ అధ్యక్షులు కల్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సహాయ సంచాలకులు జి.నాగరాజారావును కలిసి పలు సమస్యలు విన్నవించారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి సుదర్శన్, గౌరవ అధ్యక్షులు పల్లా బాల చౌడమ్మ, ఉపాధ్యక్షులు బొలిచెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటడంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్, నాబార్డు డీజీఎం అబు రాజన్ తెలిపారు. బుధవారం కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో 50 మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకుగాను ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యతను చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ విజయభాస్కర్, చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలో హోమియోపతి కాలేజ్ సమీపంలో నివసిస్తున్న చెంచు కాలనీ వాసులకు కులధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఆదేశించారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 48 వ డివిజన్‌లోని చెంచు కాలనీలో పర్యటించగా స్థానిక ప్రజలు తమ సమస్యలను డిప్యూటీ సీఎంకు ఏకరువు పెట్టారు. ఒక్కొక్కరి సమస్యలను సావధానంగా విన్న అంజద్‌బాషా వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా చాలా సంవత్సరాలుగా తమ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని దీని వల్ల తమ పిల్లలు చదువులకు దూరమై తమలాగే కూలి పనులకు వెళ్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చాలామందికి ఆధార్ కార్డులు లేవని, ఆధార్ కార్డు కోసం పోతే జనన ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారన్నారు. తమ కుటుంబాల్లో చాలామంది పిల్లలకు ఆధార్‌కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఈ కాలనీలో ఎవరెవరికి ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు లేవో గుర్తించి దరఖాస్తు చేయాలని, తాను సంబంధిత అధికారులతో మాట్లాడి ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేలా చూస్తానని వార్డు సచివాలయ సిబ్బందికి తెలిపారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నాయకులు బంగారు నాగయ్య, జయచంద్రారెడ్డి, పస్తం అంజి, తోటక్రిష్ణ, షఫీ, మధు, కె. కొండయ్య, రహీం, మియ్యా, రామ్మోహన్‌రెడ్డి, అహ్మద్, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమా మహేశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిత్య సహాయకులు ఆరోగ్యమాత



దైవ సందేశం అందజేస్తున్న మత గురువు

కడప కల్చరల్ : ఆరోగ్యమాత నిత్య సహాయకులని, విశ్వాసులందరికీ ఆమె సహాయం చేస్తూనే ఉంటుందని, అందుకే మనం ఉన్నత స్థితిలో ఉన్నామని కడప పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ వరప్రసాద్ తెలిపారు. ఆరోగ్యమాత క్షేత్రం నవదిన ఉత్సవాలలో భాగంగా రెండవరోజు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఫాదర్ మరియదాస్ దివ్యబలి పూజను సమర్పించగా, వరప్రసాద్ మరియ తల్లి దివ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియ తల్లి సహాయ సహకారాలు లేకుండా మానవాళి అభివృద్ధి చెందదని, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఉపాధి, గౌరవం, సిరి సంపదలు ఆమె మనకు సహాయంగా ప్రసాదించినవేనన్నారు. మరియ తల్లి తన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా మన రక్షణ బాధ్యత వహిస్తోందన్నారు. మనం ఆ తల్లిని గౌరవిస్తూ ఆమె అడుగుజాడల్లో నడవాలని, ఆమె కోరిన విధంగా ప్రతి కుటుంబం భక్తిమార్గంలో పయనించాలని కోరారు. దివ్యబలి పూజకు ముందు ప్రత్యేకంగా అలంకరించబడిన తేరుపై మేరీమాత స్వరూపాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. పాటలు, తేరు దివ్యబలి పీఠం అలంకరణ తదితరాలను పాస్టరల్ సెంటర్ గాయక బృందం నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ఆరోగ్యమాత అమ్మగార్లు, మేత్రాసన కోశాధికారి ఫాదర్ దేవదాస్, మల్టీ పర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, తిరుణాల కమిటీ సభ్యులు అంతోని, సెబాస్టియన్, రాజా డేవిడ్, మోహన్, ఏంజెలినా, జిల్లాలోని వివిధ గురువులు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానిత మహిళ

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో తారకరామనగర్‌లో ఓ అపరిచిత మహిళ వీధిలో ఆడుకుంటున్న పిల్లలను తన వెంట తీసుకుని వెళుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు అప్పగించారు. సదరు మహిళ మానసిక స్థితి సరిగా లేనట్లుగా ప్రవర్తించడం, అనుమానితంగా వుండటంతో ఆమెను విచారిస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో బుధవారం రాత్రి రౌడీషీటర్లకు ఆయా పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ ఎన్.వి నాగరాజు, ఎస్ఐ సిద్దయ్యలు, కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ ఉలసయ్య, ఎస్ఐ రామకృష్ణలు, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐలు రవికుమార్, తులసీనాగప్రసాద్‌లు తమ సిబ్బందితో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సర్దుబాటు టీచర్లకు జీతాలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో సర్దుబాటు, బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు లేవని వీరికి వెంటనే జీతాలను చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు రామోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతి



ఎంపీకి సమస్య వివరిస్తున్న డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్లు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లగా పనిచేస్తున్న వారికి పదవీ విరమణ వయసు 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని డిగ్రీ కళాశాల ఆధ్యాపకులు జయరామిరెడ్డి, రెడ్డిబాష, వసీవుల్ల బక్తియార్‌లు కోరారు. ఈ విషయమై కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

– ఇదే విషయమై రూట రాష్ట్ర ఉర్దూ లెక్చరర్ల వింగ్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీవుల్ల బక్తియారిలు బుధవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

అత్యవసర కేసులకు సత్వర చికిత్స అందించాలి



రిమ్స్ ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో ఓ తల్లితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: రిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర వార్డుకు వచ్చే కేసులకు సత్వర చికిత్స అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం ఆయన రిమ్స్ ఆసుపత్రిలోని ఐపీ విభాగం, ఎమర్జెన్సీ వార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విభాగం వద్ద ఎక్కువ సమయం పేషంట్లు వేచి ఉంటున్నారని, ఇకపై అలా ఎవరూ వేచి ఉండకుండా మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓపి రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో నమోదు అయిన వెంటనే సంబంధిత డాక్టర్ వద్దకు పంపేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐపీ విభాగంలో వచ్చిన ప్రతి పేషంటుకు ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఓపీ నుంచి ఐపీకి మార్చాలన్నారు. అనంతరం కాన్పుల విభాగాన్ని పరిశీలించి తల్లులతో మాట్లాడారు. డెలివరీ తర్వాత ప్రభుత్వం నుంచి అందే పథకాలను వారికి వివరించారు. హాస్పిటల్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

– మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె, రాయలపంతుల పల్లె ప్రాంతాలను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడిక తీసి, క్లాప్ వాహనాల ద్వారా వంద శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. రాయల పంతుల పల్లెకు నూతనంగా నిర్మిస్తున్న మెయిన్ రోడ్డును నాణ్యతతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కడప హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా బాలశౌరిరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న బాలశౌరిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా ఎలిమెంటరీ అండ్ సెకండరీ టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా యల్. బాలశౌరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి పుష్పలత ధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా యల్.బాలశౌరిరెడ్డి మాట్లాడుతూ సొసైటీ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగా సహచర డైరెక్టర్‌తో కలిసి వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నవంబర్‌లో సినిమా విడుదల చేస్తాం



మాట్లాడుతున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: నాని మూవీ వర్క్స్ ఆధ్వర్యంలో విశ్వకార్తీక్, ఆయూషి పటేల్ జంటగా నటిస్తున్న కలియుగ పట్టణంలో సినిమా షూటింగ్ సగ భాగం పూర్తయిందని సినిమా నిర్మాత, కందుల గ్రూపు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప రాజీవ్‌పార్కులో కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సినిమాను నవంబర్ నెలలో విడుదల చేస్తామన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని క్లినికల్ సైకాలజిస్టు రాధిక తెలిపారు. బుధవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌లోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

విజయవాడ సభను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ తలపెట్టిన వై నాట్ ఓపీఎస్ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శ్రీయపురెడ్డి వెంకట జనార్థన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాలుగేళ్లగా ఎన్ని ఉద్యమాలు చేసినా స్పందన లేకుండా ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాని జీపీఎస్ అనేది తీసుకరావడం దారుణమని అన్నారు. ఇందులో భాగంగా 1వ తేదీ నిర్వహించే సభకు జిల్లాలోని ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఫిజియో థెరపి సెంటర్ ప్రారంభం

కడప రూరల్: కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలో బుధవారం సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నీలాపురం అమీర్‌బాష ఆధ్వర్యంలో యాఫియా ఫిజియో కేర్ సెంటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో రొబాటిక్స్, లేజర్ వంటి అత్యాధునిక పరికరాలతో సెంటర్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు.

ఆత్మీయ బంధం

కడప కల్చరల్ : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి బ్రహ్మకుమారీ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ గీతా బెహన్ సుశీల, ఈశ్వరి బెహన్‌లతో కలిసి కలెక్టర్ విజయరామరాజుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఎల్ఐసీ ఎస్‌డీఎం గిరిధర్, అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి, ఆలిండియా రేడియో డిప్యూటీ డైరెక్టర్ వీరభద్రుడు తదితరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సీతాకోక చిలుకల పార్కు పరిశీలన



కీటకాల మ్యూజియంను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: వైవీయూలో ఏర్పాటైన బటర్ ఫ్లై అద్భుతమని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు డా. ఎస్.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన బటర్ ఫ్లై పార్కును, కీటకాల మ్యూజియంను ఆయన పరిశీలించారు. వీసీ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు, ఫలదీకరణకు సీతాకోక చిలుకలు ఎంతో కీలకమన్నారు. దాదాపు 200 వరకు పార్కులో వివిధ రకాల సీతాకోక చిలుకలు ఉండటం ఇక్కడి ప్రాంత పర్యావరణ సమతుల్యతను తెలియజేస్తున్నాయన్నారు. పార్కు నిర్వాహకుడు ఎస్.పి.వి. రమణ, ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ కీర్తిప్రతిష్టలు జాతీయ స్థాయికి తీసుకెళ్లాలి

- కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్
- వైద్యవిద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం



వైద్య విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను బహూకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్



అలరించిన నృత్య ప్రదర్శన

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వైద్యులు, వారు చేస్తున్న సేవల ద్వారా జాతీయ స్థాయికి కీర్తి, ప్రతిష్టలను తీసుకెళ్లాలని కడప మున్సిపల్ కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆకాంక్షించారు. బుధవారం రాత్రి ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల ఆవరణంలోని ఆడిటోరియంలో 'ఆరుషి -23' పేరుతో కాలేజ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల రోజులను ఈ క్రమంలో గుర్తు తెచ్చుకున్నారు. కడప రిమ్స్ ఆవరణంలో వైద్య కళాశాలతో పాటు, రానున్న రోజుల్లో 11 రకాల సూపర్ స్పెషాలిటీవైద్య సేవలను, కాన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాలను, ఇతరత్రా వైద్య సేవలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కళాశాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. కడప రిమ్స్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ మానవత్వంతో వైద్య సేవలను సంపూర్ణంగా అందించాల న్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శారద ప్రసంగించారు. వైద్య విద్యార్థులు, పీజీ వైద్య విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి గోల్డ్‌మెడల్స్‌ను ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం వైద్య విద్యార్థులు, చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అవగాహనతో మానసిక సమస్యలు అధిగమించవచ్చు

కడప కార్పొరేషన్: అవగాహన ద్వారా వృద్ధాప్యంలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చని క్లినికల్ సైకాలజిస్ట్ కె. శిల్ప అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని బృందా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిద్రలేమి, తమలో తాము మాట్లాడుకోవడం, మతిమరుపు, ఒంటరితనం వంటివి సర్వసాధారణంగా వృద్ధాప్యంలో వస్తాయన్నారు. వాటిని ఎలా అధిగమించాలో వారికి అవగాహన కల్పించారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. కవిత ప్రసన్న పాల్గొన్నారు.

ఢిల్లీ వేదికగా చంద్రబాబు డ్రామాలు

కడప కార్పొరేషన్: ఢిల్లీ వేదికగా ప్రతిపక్షనేత చంద్రబాబు డ్రామాలకు తెరతీశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. బుధవారం మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటరిగా పోటీ చేసి గెలిచే సత్తా చంద్రబాబుకు లేదని, అందుకే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. తాను బీజేపీతో ఇంకా పొత్తులోనే ఉన్నానని బాబు చెప్పడం దారుణమన్నారు. ఎన్నికల ముందు పొత్తులు పెట్టుకోవడం, ఆ తర్వాత పొత్తు పెట్టుకున్న పార్టీలకు వెన్నుపోటు పొడిచి కరివేపాకులాగా తీసి వేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

దిశ యాప్‌పై అవగాహన

కడప ఎడ్యుకేషన్: దిశయాప్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని దిశ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మరళీమోహన్, వెంకటసుబ్బన్న అన్నారు. బుధవారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కడప సాయిపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో దిశ యాప్, మహిళల అక్రమ రవాణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు దిశ చట్టం గురించి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. ఈ చట్టం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు హెచ్ఎం నాగేశ్వరి, స్టెప్ మేనేజర్ వివి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్ : కడప నగరం పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల యోగా శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నామని సంస్థ నిర్వాహకులు, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె. కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 9.00 నుంచి 10.30 గంటల వరకు మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌గా శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 98488 61206 సంప్రదించాలన్నారు.

లోక కల్యాణం కోసమే పర్వదినాలు

కడప కల్చరల్ : లోక కల్యాణం కోసమే రాఖీ పౌర్ణమి లాంటి పర్వదినాలను సంతోషంగా నిర్వహించుకుంటామని డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఎర్రముక్కపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక పూర్ణిమ విశిష్టతపై ఆయన ప్రసంగించారు. శ్రావణమాసం విష్ణు తత్వమని అన్నారు. చాతుర్మాస వ్రతానికి ప్రారంభం శ్రావణమాసం అని వరలక్ష్మి వ్రతం మొదలుకొని సత్యనారాయణ వ్రతం వంటి అనేక కార్యక్రమాలు ఈ మాసంలోనే నిర్వహిస్తారన్నారు.